తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY

అమిర్‌ఖాన్‌ను కలవనున్న దిల్‌రాజ్
- భారీ ప్రాజెక్టుకు ప్లాన్
8 లో..

ఇదండీ..కబురు..




సంపుటి : 22 సంచిక : 339 | శనివారం నవంబర్ 15 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

# దేశానికే తెలంగాణ రోల్ మోడల్ కాబోతోంది



కబురు, హైదరాబాద్ నవంబర్ 14

అధికారం కోల్పోయినప్పుడల్లా భారాస నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్ చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో భట్టి మాట్లాడారు.

"నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా? రైతు రుణమాఫీ చేయడం వైఫల్యమా? ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడం ప్రభుత్వ వైఫల్యమా? ఫార్మా క్లస్టర్స్ విస్తరణను వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని. కక్ష పూరిత రాజకీయాలకు మేం వ్యతిరేకం. ప్రతిపక్షంగా భారాస తన పాత్ర పోషించిందా? ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడంపైనే ఆ పార్టీ దృష్టి పెట్టింది. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. దాని ప్రకారం చేసి చూపిస్తున్నాం. ఇది విప్లవాత్మక నిర్ణయం.. రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుంది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే ప్రశ్నలు తయారు చేశాం" అని భట్టి విక్రమార్క అన్నారు.

# కులగణనతో ఏ ఇబ్బంది ఉండదు, ఎవరి రిజర్వేషన్లు తొలగించం



**కబురు, హైదరాబాద్ నవంబర్ 14**
**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బడ్జెట్‌లో విద్యాశాఖకు అత్యధిక నిధులు కేటాయించామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామన్న సీఎం.. అన్ని వర్సిటీలకు వీసీలను నియమించామని చెప్పారు. రూ. 650 కోట్లతో పాఠశాలలను బాగు చేస్తున్నామని, పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు ఇస్తున్నామని పేర్కొన్నారు.**

ఈ మేరకు ఎల్బీ స్టేడియంలో గురువారం బాలల దినోత్సవం సందరర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. 'తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యార్థులే బాగస్వాములు. కలుషితమైన ఆహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. కలుషితమైన ఆహారం పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నాసిరకం భోజనం పెట్టిన వారితో ఊచలు లెక్కపెట్టిస్తాం. నాణ్యమైన బోజనాన్ని విద్యార్థులకు అందించాలి.
సన్న వడ్లకు 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నాం. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం. మసాయిపేటలో రైలు ఢీకొన్న ఘటనలో 30 మంది పిల్లలు చనిపోతే కనీసం పరామర్శించలేదు. ప్రభుత్వం అంటే ప్రజలకు అందుబాటులో ఉండాలి. గత ప్రభుత్వంలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. గత పదేళ్లలో 5 వేలకు పైగా పాఠశాలలు మూతపడ్డాయి. పాఠశాలల మూసివేతతో విద్యకు పేదలు దూరమయ్యారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే కుల గణన జరగాలి. కేంద్రం మెడలు వంచి కుల గణన జరిపి రిజర్వేషన్లు తీసుకొస్తాం. కుల గణనతో ఎవరి రిజర్వేషన్లు తొలగించం. కులగణనతో ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. పథకాలు తీసేయడానికి సర్వే చేయడం లేదు. కులగణన మెగా హెల్త్ చెకప్ లాంటిది. కుల గణన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు పెంచడం కోసమే. జనాభా ఆధారంగా రిజర్వేషన్లు రావాలంటే కులగణన జరగాలి కొందరు కులగణనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాను. కులగణను అడ్డువచ్చే ద్రోహులను సమాజంలోకి రానివ్వొద్దు. పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాం. సర్టిఫికెట్లు ఉంటే ఉద్యోగాలు రావు.. స్కిల్ ఉంటేనే ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నాం. చదువులోనే కాదు.. క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలి.' అని సీఎం రేవంత్ తెలిపారు.



## కొడంగల్‌లో ఫార్మా విలేజ్ ద్వారా అమృతం వస్తుందా?

కబురు, హైదరాబాద్ నవంబర్ 14
సీఎం రేవంత్‌రెడ్డికి తానంటే చాలా ప్రేమ ఉన్నట్టు ఉందని.. అందుకే తనను టార్గెట్ చేస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మీడియా ప్రతినిధులతో పలు అంశాలపై ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. లగచర్ల భూ సేకరణలో తీవ్రంగా భంగపడిన ప్రభుత్వం కుట్ర అంటూ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆక్షేపించారు. ఘటన జరిగినప్పుడు అక్కడ లేని భారాస కార్యకర్తలను కూడా తీసుకెళ్లి అమానుషంగా కొట్టారని ఆరోపించారు. సురేశ్ అనే వ్యక్తి భారాస కార్యకర్తే.. ఆయనకు భూమి ఉందని తెలిపారు. లగచర్ల ఘటనలో పూర్తిగా ఇంటెలిజెన్స్, పోలీసుల వైఫల్యం ఉందని వ్యాఖ్యానించారు. రైతులపై దాడికి పోలీసులు కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్లినట్టు వెళ్లారని మండిపడ్డారు.
02

# లైఫ్ సైన్సెస్ కంపెనీల ఏర్పాటుకు కొత్త పాలసీ

కబురు, హైదరాబాద్ నవంబర్ 14
లైఫ్ సైన్సెస్ కంపెనీల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త పాలసీని తీసుకురాబోతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ రంగాల్లో ప్రపంచ స్థాయిలో రాష్ట్రం మరింత ముందంజలో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చొరవ తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. ఏడాది పాలనలో లైఫ్ సైన్సెస్‌లో సాధించిన అభివృద్ధికి సంబంధించిన వివరాలను మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.
02



"పది నెలల వ్యవధిలో రూ.35 వేల కోట్ల పెట్టుబడులు, 51 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. 141 దేశీయ, బహుళ జాతి కంపెనీలు ఔషధ, టీకాలు, లైఫ్ సైన్సెస్, పరిశోధన రంగాల్లో నిర్మాణాలు మొదలు పెట్టడం, పూర్తి చేసుకుని ఉత్పాదన మొదలు పెట్టే దశల్లో ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే 51,086 మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. మరో లక్షన్నర మంది పరోక్షంగా ఉపాధి పొందుతారు. దేశంలో ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కొత్త కంపెనీలకు హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉంది.

# లగచర్ల ఘటనలో కేటీఆర్ నీకు శిక్ష తప్పదు

లగచర్లలో కలెక్టరుపై దాడి ఘటనలో కేటీఆర్ ది కీలకపాత్ర...

పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్...

కబురు న్యూస్,హైదరాబాద్ గాంధీ భవన్,నవంబర్ 14 :



లగచర్లలో కలెక్టర్,ఇతర అధికారులపై జరిగిన దాడి ఘటన కుట్రపూరితంగా జరిగినదేనని,దాని వెనుక కేటీఆర్ కీలక పాత్ర పోషించారని ఆయనకు శిక్ష తప్పదని తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.గురువారం రోజున హైదరాబాదులోని గాంధీభవనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అధికారులపై దాడులకు దిగితే ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదన్నారు.చట్టప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు.కొడంగల్‌లో ఏమాత్రం కాలుష్యం లేని ఫార్మా కంపెనీ స్థాపించేందుకు ప్రతిపాదనలు పెడితే 90శాతం మంది రైతులు ఒప్పుకున్నారని తెలిపారు.భూసేకరణ నిమిత్తం అధికారులు లగచర్ల వెళ్తే అక్కడ భూములు లేని వాళ్లు దాడులు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.ఈ కుట్ర కేటీఆర్ కనుసన్నల్లోనే నడిచిందని వివరించారు.అధికారం కోల్పోయిన నాటినుండి కేటీఆర్ విచక్షణ కోల్పోయారని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజల్లో అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన తప్పితే ఇంకో ఆలోచన కేటీఆర్ కు లేనట్టుందని పేర్కొన్నారు.ప్రజల సేవ మరిచిన బిఆర్ఎస్ పార్టీకి ఇకపై భవిష్యత్తు ఉండదని అన్నారు.అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి హైడ్రా,మూసి ఇలా ప్రజలను తప్పుదోవ పట్టించడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని అన్నారు..

## యూనివర్సిటీలో గంజాయి కలకలం..
## రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఐదుగురు విద్యార్థులు

వరంగల్ జిల్లాలోని ఎస్సార్ యూనివర్సిటీలో గంజాయి కలకలం రేపింది. గంజాయి తాగుతూ ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గంజాయి సేవిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం (నవంబర్ 14) యూనివర్సిటీకి వెళ్లిన నార్కోటిక్ టీమ్.. ఐదుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు.


02

## తెలంగాణ గ్రూప్-4 ఫలితాలు విడుదల






కబురు, హైదరాబాద్ నవంబర్ 14
గ్రూప్-4 తుది ఫలితాలు విడుదల అయ్యాయి. గ్రూప్ 4కు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజినల్ లిస్ట్ ను గురువారం (నవంబర్ 14) సాయంత్రం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసింది.

మిగతాది 2లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

## ట్రంప్ గెలుపు డెమొక్రాటిక్ పార్టీ పుణ్యమే !

అమెరికా ఎన్నికల ఫలితాలు వెలువడిన తరవాత వెర్మోంట్ రాష్ట్రానికి చెందిన ఇండిపెండెంట్ సెనెటర్ బెర్నీ సాండర్స్ ఒక బహిరంగ లేఖ విడుదల చేశాడు. ఆ లేఖలో మొదటి వాక్యం ఇది– "శ్రామిక వర్గాన్ని వదిలేసిన డెమొక్రాటిక్ పార్టీని ఇప్పుడు శ్రామిక వర్గం వదిలేయడంలో ఆశ్చర్యమేమీ లేదు". అమెరికా ఎన్నికల ఫలితాలకి ఇంతకంటే క్లుప్తమైన, సంపూర్ణమైన, విశ్లేషణ ఇంకొకటి ఉండదు.అమెరికాలో గత 50 ఏళ్ళుగా సామాన్య మానవుడి జీవన ప్రమాణాలు పతనం చెందుతూ వస్తున్నాయి. ఆదాయ అసమానత పెరిగిపోతూ వస్తోంది. 1950లలో ఒక ఫ్యాక్టరీ కార్మికుడి జీతంతో ఇద్దరు పిల్లలున్న ఒక కుటుంబం మధ్యతరగతి జీవనం గడపగలిగేది. కానీ క్రమంగా మాన్యుఫాక్చరింగ్ ఉద్యోగాలన్నీ అమెరికా కంటే చవక జీవన ప్రమాణాలున్న దేశాలకి తరలిపోయాయి. దాని వల్ల వచ్చిన లాభాలు మాత్రం కొద్దిమంది ధనవంతుల జేబుల్లోకి జేరిపోయాయి. ఇప్పుడు అరవై శాతం మంది అమెరికన్లు ఒక్క నెల జీతం రాకపోయినా రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. 2008లో ఒబామా 'మార్పు తెస్తా'ననే వాగ్దానంతో ఎన్నికలలో నిలబడ్డాడు. మార్పు కోసం జనం ఓటు వేశారు. రిపబ్లికన్ పార్టీ బలంగా ఉన్న ఇండియానా, ఉత్తర కరోలినా వంటి రాష్ట్రాలను కూడా ఒబామా గెలుచుకున్నాడు. కానీ గెలిచిన తరవాత ఆ మార్పు వాగ్దానాన్ని వదిలేశాడు. ఆర్థిక అసమానతలకూ, కార్పొరేట్ల ధనదాహానికీ, రాజకీయాల్లో డబ్బు పాత్రకీ వ్యతిరేకంగా, 2011లో దేశవ్యాప్తంగా లక్షలమంది పాల్గొన్న 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' నిరసనలని అతి క్రూరంగా అణచివేశారు. దివాళా తీసిన పెద్ద పెద్ద కార్పొరేషన్లకి బిలియన్ల డాలర్ల ప్రజాధనాన్ని ఇచ్చి ఆదుకుంది డెమొక్రాటిక్ పార్టీ ప్రభుత్వం. ప్రజాధనాన్ని తీసుకున్న కంపెనీలు కోలుకున్న తరవాత షేర్ మార్కెట్లో లాభ పడ్డాయే గాని, సామాన్య జనానికి గానీ, అప్పులు చేసి మరీ పెద్ద పెద్ద కంపెనీలను ఆదుకున్న ప్రభుత్వానికి గానీ ఏమీ మేలు చేకూరలేదు. ఆర్థిక లోటు మాత్రం పెరిగిపోతూ వచ్చింది. వీటన్నిటి వల్లా అప్పటిదాకా దన్నుగా ఉండిన శ్రామిక జనాలు డెమొక్రాటిక్ పార్టీకి క్రమంగా దూరమవుతూ వచ్చారు.2016 ఎన్నికలలో ఇండిపెండెంట్ సెనెటర్ బెర్నీ సాండర్స్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి బరిలో నిలబడ్డాడు. అమెరికాలో అసలు ఎన్నికలకి ముందు ప్రైమరీ ఎన్నికలని జరుగుతాయి. ఆ ప్రైమరీలలో ప్రతీ పార్టీ, రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో నిలబడడానికి, తన అభ్యర్థిని ఎన్నుకుంటుంది. 2016 ప్రైమరీలలో బెర్నీ సాండర్స్ ఆర్థిక అసమానతలనీ, కార్పొరేట్ అవినీతినీ, ఫార్మా, ఇన్సూరెన్సు కంపెనీల లాభాపేక్షనీ వ్యతిరేకిస్తూ, ప్రభుత్వం సామాన్య ప్రజల కోసం పనిచేయాలనే నినాదంతో నిలబడ్డాడు. డెమొక్రాటిక్ పార్టీతో విసిగిపోయి, ఎన్నికలకే దూరమైపోయిన సామాన్య జనం లక్షలాదిగా బెర్నీని సమర్థించారు. ముఖ్యంగా యువత బెర్నీని ఆదరించింది. బెర్నీ ర్యాలీలు జనంతో కిటకిటలాడగా, అదే పార్టీలోని బెర్నీ ప్రత్యర్థి హిల్లరీ ర్యాలీలు వెలవెలబోయాయి. మీడియా బెర్నీని వెలివేసినా, ప్రైమరీలలో కొత్త ఓటర్లు ఓటు వేయడానికి డెమొక్రాటిక్ పార్టీ నాయకత్వం అవాంతరాలు సృష్టించినా, కార్పొరేట్ కంపెనీలు మిలియన్ల డాలర్లు హిల్లరీ ప్రచారానికి గుమ్మరించినా, కేవలం సామాన్య జనం ఇచ్చిన 10%–%–20 డాలర్ల విరాళాలతో ప్రచారం చేసిన బెర్నీ 23 రాష్ట్రాలు గెలుచుకున్నాడు. దేశ వ్యాప్తంగా 43 శాతం ఓట్లు సాధించాడు. కానీ, పార్టీ అభ్యర్థిగా నామినేషన్ గెలుచుకున్న హిల్లరీ, బెర్నీ ద్వారా డెమొక్రాటిక్ పార్టీకి వచ్చిన మద్దతుని తన వేపు తిప్పుకోవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. అంతేకాక "గంటకి జీతం కనీసం పదిహేను డాలర్లు ఇవ్వాలి" అనే డిమాండునీబీ అందరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలనే డిమాండునీ అవహేళన చేసింది. మొత్తం మీద మళ్ళీ శ్రామిక జనాల్ని నిస్పృహలోకి నెట్టివేసి, ట్రంప్ బూచిని చూపి "నాకు తప్ప ఇంకెవరికి ఓటేస్తారు మీరు" అన్న నిర్లక్ష్యంతో గెలిచిపోతాననుకుంది హిల్లరీ. కానీ శ్రామిక జనాన్ని దూరం చేసుకున్న కారణంగా ట్రంప్ చేతిలో ఓడిపోయింది.2020లో మళ్ళీ చరిత్ర పునరావృతమైంది. బెర్నీ మళ్ళీ నిలబడ్డాడు. ఈసారి బెర్నీ పేరూ, బెర్నీ శ్రామిక జన పక్షపాతమూ, జనానికి తెలిసి ఉండడం చేత రాష్ట్రం తరవాత రాష్ట్రం బెర్నీ గెలవడం మొదలుపెట్టాడు. దాంతో దడ పట్టుకున్న పార్టీ నాయకత్వం బైడెన్ తప్ప మిగతా అభ్యర్థుల్ని అందరినీ బరిలో నుంచి తొలగించి, ఒబామాకి నల్ల జాతీయులలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి నల్ల జాతీయులు ఎక్కువగా ఉన్న దక్షిణ కరోలినా రాష్ట్రం బైడెన్ గెలుచుకొనేలా చేసి, బెర్నీ ఉప్పెనకి అడ్డుకట్ట వేశారు. బైడెన్ నామినేషన్ గెలిచేలా చేశారు. కానీ ఇన్ని నమ్మకద్రోహాల వల్ల శ్రామిక జనాలని శాశ్వతంగా దూరం చేసుకుంది డెమొక్రాటిక్ పార్టీ! కానీ ట్రంప్ దుష్పరిపాలనతో కూడా జనం విసిగిపోయి ఉండడం చేత చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు, బొటాబొటీగా కేవలం 10–%–%20 వేల ఓట్ల తేడాలతో 4–%–%5 రాష్ట్రాలు గెలిచి మొత్తానికి అధ్యక్షుడు కావడానికి అవసరమైన ఎలెక్టోరల్ ఓట్లను బైడెన్ సంపాదించుకున్నాడు.కానీ శ్రామిక జనాల పరిస్థితి ఏమీ మెరుగుపడలేదు. కోవిడ్ వ్యాధి వ్యాప్తి తగ్గాక ఆర్థిక వ్యవస్థ కొంత కోలుకున్నప్పటికీ, నిరుద్యోగం అదుపులో ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. సామాన్య జనాల జీతాలు అంతగా పెరగక, ఎన్నో ఇక్కట్లు పడవలసి వచ్చింది. 2024లో డెమొక్రాటిక్ పార్టీ, ప్రైమరీని పేరుకి మాత్రమే నిర్వహించింది. ఎటువంటి డిబేట్లూ లేకుండా బైడెన్‌ని అభ్యర్థిగా ఎన్నుకుంది. ప్రైమరీ దశలో డిబేట్లు నిర్వహించి ఉంటే బైడెన్ మానసిక క్షీణత అప్పుడే బయటపడి ఉండేది. కొత్త అభిప్రాయాలతో జనానికి ఒక ఆశ కలిగించే అభ్యర్థి ఎవరైనా గెలిచి ఉండేవారు. ఆఖరికి ట్రంప్‌తో జూలైలో జరిగిన డిబేట్‌లో బైడెన్ మానసిక క్షీణత బయటపడింది. అప్పటికయినా 'ప్రజాస్వామికంగా' ఓపెన్ కన్వెన్షన్ నిర్వహిస్తే జనాన్ని ఉత్తేజపరచగలిగే అభ్యర్థిని ఎన్నుకుని ఉండొచ్చు. దానికి విరుద్ధంగా ప్రజల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా నాలుగేళ్ల పాటు ఉపాధ్యక్షురాలిగా ఉండి కూడా ఎటువంటి ప్రజాదరణా లేని, తనకంటూ ఒక గుర్తింపునీ తెచ్చుకోలేని కమలా హారిస్‌ని అభ్యర్థిగా నియమించారు. అప్పటికైనా కమల కొత్త వాగ్దానాలతో ముందుకి వచ్చి ఉండవచ్చు. సామాన్య జనం ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎలా పరిష్కరించగలనో అన్నది వివరించి ఉండవచ్చు. కమల అవేవీ చేయకుండా కేవలం ట్రంప్ అవినీతి మీదా ట్రంప్ నేర చరిత్ర మీదా మాత్రమే దృష్టి సారించింది. "ట్రంప్ చెడ్డవాడు కాబట్టి నాకు ఓటు వేయండి" అన్న ఏకైక నినాదంతో గెలవాలని ప్రయత్నించింది. అసలు సామాన్య జనం సమస్యల్లో ఉన్నారనే మాటే ఎత్తకుండా ప్రచారం జరిపింది. "అంతా బాగానే ఉంది, నిరుద్యోగం అదుపులో ఉంది, స్టాక్ మార్కెట్లు పైపైకి వెళుతున్నాయి" %–%–అన్న ధనికవర్గ అవగాహనతో ప్రచారం జరిపింది. ఒక ఇంటర్వ్యూలో "బైడెన్ కంటే మీ ప్రభుత్వం ఎలా తేడాగా ఉంటుంది?" అన్న ప్రశ్నకి "ఏమీ తేడాగా ఉండదు" అని సమాధానం ఇచ్చింది.

టంప్ దీన్ని తనకి అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమయ్యాడు. ప్రజల కష్టాలన్నిటికీ, ధరలు పెరగడానికీ, జీతాలు పెరగకపోవడానికీ అక్రమ వలసదారులే కారణమనే భ్రమ కలిపించాడు. తనను గెలిపిస్తే 2 కోట్ల అక్రమ వలసదారుల్ని తిరిగి పంపించేస్తాననీ, దాని వల్ల ధరలూ నేరాలూ తగ్గిపోతాయనీ జనాల్ని భ్రమింపజేశాడు. చైనా దిగుమతుల మీద 60శాతం పన్ను విధిస్తాననీ, దాని ద్వారా ఇతర దేశాలకి తరలిపోయిన ఉద్యోగాలు వెనక్కి రప్పిస్తానని వాగ్దానాలు చేశాడు.

# తెలంగాణ గ్రూప్-4 ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి
అభ్యర్థులు పూర్తి వివరాల కోసం టీజీపీఎస్సీ అధికారిక https://www.tspsc.gov.in వెబ్ సైట్ ను సందర్శించాలని.. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని కమిషన్ అభ్యర్థులకు సూచించింది.కాగా, 8,180 గ్రూప్ 4 పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 1వ తేదీన టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 9,51,321 మంది అభ్యర్థులు గ్రూప్ 4 పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నారు. 2023 జూలై 1వ తేదీన టీజీపీఎస్సీ గ్రూప్ 4 పరీక్షను నిర్వహించింది. రిటన్ టెస్ట్ లో క్వాలిఫై అభ్యర్థులను ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున సర్టిఫికేట్ వెరిఫికేషన్ కు ఎంపిక చేసింది టీజీపీఎస్సీ. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 8,084 మంది అభ్యర్థులను గ్రూప్ 4 ఉద్యోగానికి ఎంపిక చేసింది. ఈ మేరకు గ్రూప్ 4 ఉద్యోగానికి సెలెక్టైన అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్ట్ గురువారం టీజీపీఎస్సీ రిలీజ్ చేసింది. 8,180 పోస్టులకు నోటిఫికేషన్ రిలీజ్ చేయగా.. ఇప్పుడు 8,084 ఉద్యోగాలకు మాత్రమే అభ్యర్థులను సెలెక్ట్ చేశారు. మరో 96 పోస్టులను భర్తీ చేయకుండా పెండింగ్ లో పెట్టింది టీజీపీఎస్సీ.

# లగచర్ల కేసులో కీలక మలుపులు.. హైకోర్టులో పట్నం నరేందర్ రెడ్డి క్వాష్ పిటిషన్




లగచర్ల లడాయిలో ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు తెరపైకి వస్తుండటంతో ఈ ఇష్యూపై మరింత అటెన్షన్ పెరిగింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ లగచర్ల ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. లగచర్లలో ప్రభుత్వాధికారులపై దాడి కేసులో చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్ రెడ్డిని న్యాయవాదులు కలిశారు. వారి ద్వారా కోర్టుకు నరేందరెడ్డి అఫిడవిట్ పంపించారు. పోలీసులు నిబంధనలు పాటించలేదని తెలిపారు. అరెస్ట్ సమయంలో కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వలేదన్నారు. సంబంధం లేని కేసులో ఇరికించారని ఆరోపించారు. వీటిని పరిగణనలోకి తీసుకుని రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేయాలని హైకోర్టుకు విన్నవించారు. మరోవైపు పోలీసులు ఇచ్చిన కన్ఫెషన్ రిపోర్టుపై జైలు నుంచి పట్నం నరేందర్ రెడ్డి లేఖ విడుదల చేశారు. తన పేరుతో పోలీసులు ఇచ్చిన కన్ఫెషన్ రిపోర్ట్ తప్పని.. కేటీఆర్ గురించి పోలీసులకు తానేమి చెప్పలేదన్నారు. పోలీసులు తన నుంచి స్టేట్‌మెంట్ తీసుకోలేదని తెలిపారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో తనకు తెలియదన్నారు. తన అడ్వొకేట్ కోరితే రిమాండ్ రిపోర్ట్ ఇచ్చార్నారు పట్నం నరేందర్‌రెడ్డి.

### 7రోజుల కస్టడీకి కోరుతూ పోలీసుల పిటిషన్

మరోవైపు వికారాబాద్ కోర్టులో పోలీసులు కస్టడీ పిటిషన్ వేశారు. నరేందర్‌రెడ్డిని 7రోజుల కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ వేశారు. విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ఇటు పట్నం నరేందర్‌రెడ్డి కూడా వికారాబాద్ కోర్టులోనే బెయిల్ పిటిషన్ వేశారు. రెండింటిని సోమవారం విచారిస్తామని కోర్టు తెలిపింది.ఇక లగచర్ల లడాయి పొలిటికల్ టర్న్ తీసుకోవడంతో ఇష్యూపై అటెన్షన్ పెరిగింది. ఘటనలో కుట్ర కోణం ఉందని తేలడంతో మరింత రచ్చ రాజుకుంది. ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఎంక్వైరీ జరుగుతోంది. కీలక ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. పరిగి పోలీస్‌స్టేషన్‌కు అడిషనల్ డీజీ మహేష్ భగవత్, ఐజీ సత్యనారాయణ వెళ్లారు.

### లగచర్ల ఘటనలో మొత్తం మూడు కేసులు నమోదు

ఇక లగచర్ల ఘటనలో మొత్తం మూడు కేసులు నమోదు చేసిన పోలీసులు ఇప్పటివరకు 21మందిని అరెస్ట్ చేశారు. 47మంది నిందితులను గుర్తించామని ఐజీ సత్యనారాయణ తెలిపారు. మహేష్, సురేష్, రాజు కలిసి కలెక్టర్‌ను ట్రాప్ చేశారన్నారు. మరోవైపు ఇప్పటికే పట్నం నరేందర్‌రెడ్డి ఫోన్‌ను ఓపెన్ చేసి డేటా పరిశీలించిన పోలీసులు నరేందర్, సురేష్ కాల్స్‌పై కూడా ఫోకస్ పెట్టారు. ఈ ఫోన్ డేటా ఆధారంగా ఈ కేసు మరో మలుపు తిరిగే ఛాన్స్ ఉంది.
ఇక విచారణలో సంచలన అంశాలు బయటికి వచ్చాయి. ప్రభుత్వ నోటిఫికేషన్‌లో భోగమోని సురేష్‌కు సంబంధించి ఎలాంటి భూమి లేదని పోలీసులు తేల్చారు. 42మంది నిందితుల్లో 19మందికి అస్సలు భూమే లేదని ఐజీ నివేదిక ఇచ్చారు. దాంతో, సురేష్, పట్నం నరేందర్‌రెడ్డికి..ఎవరి నుంచి ఆదేశాలు వచ్చాయో తేల్చే పనిలో పడ్డారు పోలీసులు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగా కేటీఆర్‌తో పాటు..ఇతరుల ఆదేశాలున్నట్టు రిమాండ్ రిపోర్ట్ వెల్లడించారు పోలీసులు. మరి కేసులో నెక్ట్స్ ఏం జరుగుతుందో చూడాలి.

## కొడంగల్‌లో ఫార్మా విలేజ్ ద్వారా అమృతం వస్తుందా?

మొదటిపేజీ తరువాయి
ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అని రేవంత్ రెడ్డి మాటలు చెబుతున్నారు.. కానీ అవి సాధ్యం కాదన్నారు. కొడంగల్‌లో ఫార్మా విలేజ్ ద్వారా అమృతం వస్తుందా? అని ప్రశ్నించిన ఆయన.. ప్రజలు కూడా ఇదే విషయాన్ని అడుగుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రికి తన సొంత నియోజకవర్గంపై కూడా పట్టులేదన్నారు. తాము సీఎం నియోజకవర్గంలోనే కలెక్టర్‌పై దాడి చేసేంత బలమైన వ్యక్తులమా? అని నిలదీశారు. ప్రాజెక్టులు, పెట్టుబడులు తేవాలంటే ఎంతో కష్టపడాలని... ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు హరీశ్‌రావు ఎంత కష్టపడ్డారో గుర్తు లేదా అని కేటీఆర్ అన్నారు. వీళ్లకు ప్రభుత్వాన్ని నడపటం చేతకావటం లేదని వ్యాఖ్యానించారు.

## లైఫ్ సైన్సెస్ కంపెనీల ఏర్పాటుకు కొత్త పాలసీ

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రంలో ఒకే చోట కాకుండా పలు ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పరిశ్రమల్లో ఆధునిక కాలుష్య నియంత్రణ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా అనుమతులు ఇచ్చినప్పుడే నిబంధనలు విధిస్తున్నాం. ఆసియాలోనే మూడో అతిపెద్దదైన జపాన్‌కు చెందిన టకెడా లైఫ్ సైన్సెస్ సంస్థ స్థానిక బయోలాజికల్–ఇ తో కలిసి ఏటా 5 కోట్ల డెంగీ వ్యాక్సిన్లు ఉత్పత్తి చేస్తోంది. ఫార్మా క్లస్టర్లకు సంబంధించి ప్రజల డిమాండ్లు నెరవేర్చాకే భూసేకరణ చేపడతాం" అని శ్రీధర్ బాబు తెలిపారు.

## యూనివర్సిటీలో గంజాయి కలకలం.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఐదుగురు విద్యార్థులు

మొదటిపేజీ తరువాయి
అనంతరం హాస్టల్ గదుల్లో సోదాలు చేసి నిల్వ ఉన్న గంజాయి నార్కోటిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తాగుతూ పట్టుబడ్డ విద్యార్థులను నార్కోటిక్ బ్యూరో పోలీసులు హసన్ పర్తి పోలీస్ స్టేషన్లో అప్పగించారు. క్యాంపస్‌లో విద్యార్థులు గంజాయి తాగుతూ పట్టుబడటంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పరిగి టూ సంగారెడ్డి: లగచర్ల దాడి కేసులో 16 మంది నిందితులకు జైలు ట్రాన్స్‌ఫర్



వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో అధికారులపై దాడి ఘటనలో రిమాండ్‌దైన 16 మంది నిందితులకు అధికారులు జైలు ట్రాన్స్‌ఫర్ చేశారు. పరిగి సబ్ జైలు నుండి 16 మంది నిందితులను సంగారెడ్డి సెంట్రల్ జైలుకు తరలించారు. పరిగి సబ్ జైల్లో 50 మంది ఖైదీలకు మాత్రమే అవకాశం ఉండటంతో వీరిని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా.. లగచర్ల గ్రామం పరిగికి సమీపంగా ఉండడం వల్ల ములాఖత్‌ల తాకిడి పెరగడంతో పరిగి నుండి నిందితులను సంగారెడ్డి జైలుకు తరలించారు. కాగా, లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర రెవెన్యూ సిబ్బందిపై గ్రామస్తులు దాడికి దిగారు. ఏకంగా కలెక్టర్‌పైనే దాడి జరడగంతో ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుంది. ఇందులో భాగంగానే అధికారులపై దాడులకు పాల్పడ్డ నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 'ఇందిరా మహిళా శక్తి' భవనాలు: సీఎం రేవంత్



హైదరాబాద్: ప్రజాపాలన–విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు విజయోత్సవాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ సభల్లో సీఎం పాల్గొననున్నారు. మహిళా సాధికారత, రైతుల సంక్షేమాన్ని సభల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. ఈ నెల 19న వరంగల్ వేదికగా 'ఇందిరా మహిళా శక్తి' భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 7న ట్యాంక్ బండ్, 8న సచివాలయం, 9న నెక్లెస్ రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.

## కుల గణన సర్వేతో దేశానికే ఆదర్శం తెలంగాణ...

### కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

బాన్సువాడలో కుల గణన సర్వేను పరిశీలించిన కార్పొరేషన్ చైర్మన్



**కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14**



దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన దేశానికి ఆదర్శంగా రాష్ట్రం నిలుస్తుందని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో జరుగుతున్న సమగ్ర కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల గణన సర్వేకు శ్రీకారం చుట్టారని, సర్వేకు ప్రజలు సహకరించాలని, కుల గణన ద్వారా కులాలను ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు తోడ్పాటవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నార్ల నందకిషోర్ గుప్తా, మోతిలాల్, మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ ఉద్యోగులు తుల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గొల్ల వెంకన్న యాదవ్, రహీస్, ఆఫ్రోజ్, మన్నాన్, జహీర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బెడ బుడగ జంగాలకు గోసంగి కుల ధ్రువీకరణ పత్రాలు రద్దుచేయాలి...



– సబ్ కలెక్టర్ కు వినతిపత్రం..

**కబురు న్యూస్,బోధన్ నవంబర్14..**

బెడ బుడగ జంగాలకు మంజూరు చేసిన గోసంగి కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని గోసంగి సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం బోధన్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సుంకరి పల్లి సాయన్న, జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లెల సాయిచరణ్ లు మాట్లాడుతూ గోసంగి కులానికి సంబంధం లేని బెడ బుడగ జంగాల కులానికి చెందిన వారు గత 30ఏళ్ల నుండి గోసంగి కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకు వ్యతిరేకంగా 2016 నుండి గోసంగి కుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. గత రెండు నెలల క్రితం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ డి.ఎల్.ఎస్.సి. కమిటీ ఏర్పాటు చేస్తూ అడిషనల్ కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రస్తుతం సబ్ కలెక్టర్, తహసీల్దార్ ల పరిశీలన జరుగుతున్నందున, చేపడుతున్న నివేదికను కలెక్టర్ కు అందించాలని కోరడం జరిగిందన్నారు. బోధన్ డివిజన్ పరిధిలోని నవిపేట్ మండలంలోని హనుమాన్ ఫారం గ్రామంలో మాత్రమే గోసంగి కులస్తులు ఉన్నారని, వీరిని మాత్రమే కుల గణనలో గోసంగిలుగా గుర్తించాలన్నారు. ఇన్ని రోజులు గోసంగిలుగా చలామణి అయిన రాకాసిపేట్ గోసంబస్తి, బోధన్ మండలంలోని నాగన్ పల్లి, బెల్లాల్, ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, వర్ని మండలంలోని వర్ని, హుమ్నపూర్, చందూర్ మండలంలోని చందూర్, గోవూర్, రెంజల్ మండలంలోని సాటాపూర్, కునేపల్లి, నవిపేట్ మండలంలోని నవిపేట్ మోకాన్ పల్లి, జలాల్ పూర్, రాంపూర్, లింగాపూర్, అబ్బాపూర్ గ్రామాలలో ఉన్న వారు గోసంగీ కులస్తులు కారని వీరు బెడ(బుడగ)జంగం కులస్తులు అని వీరిని కుల గణనలో బెడ బుడగ జంగం కులస్థులుగా నమోదు చేయాలని అధికారులను కోరడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, కోశాధికారి ధర్మపురి, కార్యదర్శులు వెంకటేష్, నర్సయ్య, మల్లేష్, శషికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన డిగ్రీ కళాశాల అధ్యాపకుడు భగవాన్ రెడ్డి



**కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14**

బాన్సువాడ ఎస్ఆర్ఎన్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న భగవాన్ రెడ్డి ఎస్ జె జె టి యూనివర్సిటీలో స్టడీ ఆన్ కెమికల్ అనాలసిస్ అండ్ మూసి రివర్ అండ్ ఇంపాక్ట్ అనే అంశంపై డాక్టర్ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకుగాను యూనివర్సిటీ కళాశాల అధ్యాపకుడైన భగవాన్ రెడ్డికి డాక్టరేట్ ను ప్రధానం చేశారు. కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సాధించినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాలస్వామి అధ్యాపక బృందం భగవాన్ రెడ్డికు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, అధ్యాపకులు చిరంజీవి, మోహన్ రావు, విట్టల్, శంకర్రావు, అంబయ్య, సుధాకర్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామంతో మానసిక ఒత్తిడి తగ్గించుకోవచ్చు




ఐఎంఏ అధ్యక్షుడు డా.దామోదర్ రావు...

**కబురు న్యూస్,నిజామాబాద్ నవంబర్ 14 :**

ప్రతి రోజూ వ్యాయామం,యోగా,ప్రాణామయం చేయడంతో పాటు జీవన శైలి విధానంలో మార్పు చేసుకుంటే మానసిక ఒత్తిడి,షుగర్ వ్యాధిని నివారించవచ్చని ఐఎంఏ అధ్యక్షుడు డా.దామోదర్ రావు అన్నారు.ఐఎంఏ నిజామాబాద్,భారతియ పిల్లల వైద్యుల సంఘం వారి సంయక్త అధ్వర్యంలో గురువారం నగరంలోని వేర్వేరు ప్రాంతాలలో ఉదయం మారుతి నగర్ స్నేహ సొసైటీ భవనంలో,భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని,ఖలీల్ వాడీలోని సన్ రైస్ ఆసుపత్రిలో ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం పురస్కరించుకొని రోగులకు వైద్యులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు దామోదర్ రావు షుగర్ వ్యాధి పై పేషెంట్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డా.దామోదర్ రావు, ఐఏపీజిల్లా ప్రధాన కార్యదర్శి నేతిప్రధాన కార్యదర్శి డా. కె. శ్రీశైలం,ఐఏపీ ప్రధాన కార్యదర్శి డా. నేతి బాలెష్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి గురించి ఎవరు కూడా భయపడ వలసిన అవసరం లేదని,వ్యాధి వచ్చాక వైద్యుని పర్యవేక్షణ లో చికిత్స తీసుకొని వ్యాధిని అదుపులో ఉంచు కోవాలని అన్నారు. ప్రజలు తీసుకొనే ఆహారంలో జంక్ పుడ్ కాకుండా ఆరోగ్య కరమైన ఆహారాన్ని సరైన సమయంలో తీసుకుంటే ఈ వ్యాధిని నయం చేయవచ్చునని అన్నారుఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డా.దామోదర్ రావు,ప్రధాన కార్యదర్శి డా. కె. శ్రీశైలం,ఐఏపీ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి డా. నేతి బాలెష్,కొశాదికారి డా. రాజేంద్ర ప్రసాద్, డా. అజ్జ శ్రీనివాస్,డా. వినోద్ కుమార్ గుప్తా,డా. వినయ కుమార్,డా. రాఘవేంద్ర,డా. గాంధీ,డా. గోపి కృష్ణ, డా. శ్రీధర్ రావు,డా.అర్చన,స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య,ప్రిన్సిపల్ జ్యోతి,వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి,సిబ్బంది,275 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14**

బాన్సువాడ మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు ఉపాధ్యాయులుగా తరగతి గదులలో విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మనోహర్, శంకర్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు హన్మాండ్లు, రాజేశ్వర్ ఆనంద్ కుమార్,, ప్రవీణ్ కుమార్,శంకర్, పుష్పలత, విట్టల్ రెడ్డి ,నయన్ కుమార్, నజీమా బేగం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహ సొసైటీలో ఘనంగా బాలల దినోత్సవం





**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,నవంబర్ 14 :**

మారుతినగర్ లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్ స్ట్రక్షన్, దివ్యాంగుల పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునితా కుంచాల పాల్గొని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,బాలల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ బాలలు సకలాంగ బాలలకంటే మంచి ప్రతిభను చూపి వారు దివ్యాంగులు ఎందులకు తక్కువ కారని నిరూపించారన్నారు.చాలా మంది విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా మంచి వేషాదారణలో అందరిని ఆకట్టుకున్నారు.అంధ విద్యార్థులు పాటలు పాడడంలో మంచి నైపుణ్యాన్ని ప్రదరిస్తున్నారని అదేవిధంగా మానసిక దివ్యాంగులు నృత్యాలతో అందరిని ఆకట్టుకుంటున్నారని వారికి శిక్షణను ఇచ్చిన తీర్చి దిద్దిన యజమాన్యానికి,సిబ్బందికి అభినందించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ తమ సందేశాన్ని బాలలకు అందించారు. అనంతరం బాలలకు బహుమతులు, మిఠాయిలు పంచిపెట్టారు. జాతిపితా మహాత్మ గాంధీ,జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్ర బోస్, రాణి రుద్రమదేవి, సావిత్రిబాయి పూలే, పింగళి వెంకన్నవివిధ వేషదారణలో విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సోసైటి కార్యదర్శి యస్. సిద్దయ్య, ప్రిన్సిపల్ యస్. జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి,అంధ విద్యార్థులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ...

– విశ్వ భారతి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14**



బిచ్కుంద మండల కేంద్రంలోని విశ్వభారతి ప్రైవేటు పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు ఉపాధ్యాయులుగా వారి తరగతులలో విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సాయిలు మాట్లాడుతూ మాజీ దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి చిన్ననాటి నుండే ప్రణాళిక చేసుకొని ముందుకు వెళ్లాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సాయిలు, బసంత్, సంగ్రామ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ లాల్ నెహ్రూకు ఘన నివాళులు



**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,నవంబర్ 14 :**



దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజాప్రతినిధులు,అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు.జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి,రాకేష్ రెడ్డి,కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్,బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.దేశానికి నెహ్రూ అందించిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కబురు KABURU TELUGU DAILY



## కుల గణన సర్వే తీరును పరిశీలించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి



కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14

బాన్సువాడ మండలంలోని కోయ్యగుట్టతండా గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న సామాజిక కుల గణన సమగ్ర సర్వేను గురువారం సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసే ప్రక్రియను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణాన సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలను ఎలాంటి తప్పిదాలు లేకుండా నమోదు చేయాలని, ప్రజలు సర్వేకు వచ్చే ఎన్యుమారేటర్స్ కు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రహేలా బేగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రతి కుటుంబం తప్పనిసరి సర్వే చేయించుకోవాలి

### ... ఎంపీఓ సత్యనారాయణ రెడ్డి



కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేను గ్రామాల్లోని ప్రతి ఒక్క కుటుంబం తప్పనిసరి సర్వే చేయించుకొని అధికారులకు సహకరించాలని ఎంపీఓ సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో కులగణన సర్వేలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వరకు బాన్సువాడ మండలంలో 37% సర్వే పూర్తయిందని 100% పూర్తయ్యేందుకు ప్రజలు సర్వే వచ్చేసి సిబ్బందికి సహకరించి సర్వేను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్, ఎన్యుమారేటర్స్ మంత్రి కాశిరాం, చాంద్,కోడర్ల సాయిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే డయల్ యువర్ డిపో మేనేజర్

కబురు న్యూస్, బాన్సువాడ నవంబర్,14

బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు ప్రజలు తమ సలహాలు సూచనలు అందించేందుకు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సరితా దేవి తెలిపారు. ప్రయాణికులు ప్రజలు తమ సలహాలు సూచనలు తెలియజేయడానికి డిపో మేనేజర్ 9959226020 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

## వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



కబురు న్యూస్, బాన్సువాడ నవంబర్ 14



బాన్సువాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకేక్ష వస్త్ర దుకాణాన్ని గురువారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణ నిర్వాహకుని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసులను నిర్వాహకులు కాసిం శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు నార్ల నందకిషోర్ గుప్తా, మోతిలాల్, గొల్ల వెంకన్న యాదవ్, మన్నాన్, సొసైటీ డైరెక్టర్ రేంజర్ల సాయిలు, అఫ్రోజ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవలు నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం

### డీఐజీ రమేశ్ రెడ్డి...

నిజామాబాదు ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో సేవలు నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమైనవని స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖ నిజామాబాద్ డీఐజీ రమేశ్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో సేవలు అందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు.కార్యాలయ సిబ్బంది ఎలాంటి బంద్‌లు పాటించడం లేదని స్పష్టం చేశారు.కొందరు దస్తావేజు లేఖర్లు మాత్రమే సేవలు నిలిపివేసినట్లు వారి ద్రష్టికి వచ్చింది.దానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ తెరిచి ఉన్నాయని,కావున ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి నేరుగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను సంప్రదించి యాదవిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు అని వారు వెల్లడించారు.

## ఇందూర్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు...







కబురు న్యూస్,బోధన్ నవంబర్14..

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల ఇందూర్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం భారత మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని ఇందూర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు సందడి చేశారు. విచిత్ర వేషధారణలు వేసుకుని, పాటలతో పాఠశాల ప్రాంగణం మారు మోగిపోయింది. చిన్నారుల సృజనాత్మకతను వెలికి తీయడానికి వీలుగా వివిధ రకాల పోటీలను పాఠశాల యాజమాన్యం నిర్వహించింది. చిన్నారుల ఫాన్సీ డ్రెస్ పోటీలు చూపారులను అలరించాయి. సమాజంలో వివిధ వృత్తులలో బాధ్యతలు నిర్వహించే వ్యక్తుల వేషధారణలతో సందడి చేశారు.

## అభ్యాస పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు




కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14



బాన్సువాడ మండల కేంద్రంలోని అభ్యాస ప్రైవేటు పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వేషాధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బాలల దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రవణ్,పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్ గౌడ్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## నిర్మల హృదయ పాఠశాల విద్యార్థులు చూపిన నైపుణ్యం అమోఘం

### ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కొదండరామ్...

కబురు న్యూస్, నిజామాబాద్ టౌన్, నవంబర్ 14 :






బాలోత్సవంలో నిర్మల హృదయ పాఠశాల విద్యార్థులు చూపిన నైపుణ్యం అమోఘమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కొదండరామ్ అన్నారు.బాలోత్సవం 2024 కార్యక్రమం 12,13 తేదీలలో జన విజ్ఞానవేదిక,టి.జి పెన్షనర్స్ అసోసియేషన్,ప్రెసిడెన్సీ పాఠశాల కలిసి నిర్వహించిన ఈ బాలోత్సవంలో 150కి పైగా పాఠశాలల నుండి సుమారు 1500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ బాలోత్సవంలో నిర్మలహృదయ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ మొత్తం 10 బహుమతులను గెలుచుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ,నిర్మలహృదయ పాఠశాల విద్యార్థులు చూపిన నైపుణ్యం అమోఘమని, మీ సృజనాత్మకతను గర్విస్తున్నామంటూ విద్యార్థులను ప్రశంసించారు.మరో అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ,మీరు మా పాఠశాల పేరును ప్రతిష్ఠాత్మకంగా నిలిపారు.మీ ప్రతిభతో మీరు స్ఫూర్తిగా నిలుస్తున్నారని విద్యార్థులను ప్రోత్సహించారు.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రేవ్ సిస్టర్ డా. నిర్మల మాట్లాడుతూ,పిల్లల సృజనాత్మకతను,ప్రతిభను ప్రోత్సహించడమే మన బాధ్యతని పేర్కొన్నారు.రేవ్ సిస్టర్ సరిత ప్రధానోపాధ్యాయురాలు,విద్యార్థులను ప్రశంసిస్తూ,మీరు చూపించిన ప్రతిభతో పాఠశాల పేరు మరింత వెలుగొందుతోంది. అని అన్నారు.ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ రేవ్ సిస్టర్ సురేఖ పిల్లలు పట్టుదలతో ముందుకు సాగాలని,వారిని భవిష్యత్తు భారత పౌరులుగా తీర్చిదిద్దడమే మన ప్రథమ కర్తవ్యమని అన్నారు.

ఈ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులను కూడా రేవ్ సిస్టర్ డా. నిర్మల ప్రత్యేకంగా అభినందిస్తూ,మీ అందరి కృషి ఫలితం ఈ విజయం.పిల్లలు మరింత ఉన్నత స్థానాలను సాధించాలని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

## డ్రైనేజీని పరిశీలించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

కబురు న్యూస్,బాన్సువాడ, నవంబర్ 14

బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా నుండి వాసవి ప్రైవేటు పాఠశాల వరకు గల డ్రైనేజీ పూర్తిగా ఇబ్బందికరంగా మారడంతో గురువారం కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, స్థానిక మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీని శుభ్రపరచాలని సూచించారు. వ్యాపారస్తులు తమ చెత్తాచెదారాన్ని డ్రైనేజీలో పార వేయకుండా మున్సిపాలిటీ నుండి వచ్చే చెత్త బండి లోనే చెత్తను వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన వ్యాపారస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిలర్లు నార్ల నందకిషోర్ గుప్తా, మోతిలాల్, నాయకులు అజీమ్, గుడాల నగేష్, డైరెక్టర్ రేంజర్ల సాయిలు, మన్నన్, అఫ్రాజ్, వ్యాపారస్తులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులకు నోటీసులు అందజేసిన మున్సిపల్ అధికారులు



కబురు న్యూస్, బాన్సువాడ నవంబర్ 14

బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా నుండి వాసవి ప్రైవేట్ పాఠశాల వరకు గల వ్యాపారస్తులు తమ దుకాణాల ముందు డ్రైనేజీ పై నిర్మించుకున్న నిర్మాణాలను తొలగించాలని గురువారం మున్సిపల్ అధికారులు వ్యాపారస్తులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైనేజీ పై నిర్మాణాలు చేసుకోవడం వల్ల పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి సిబ్బందికి ఇబ్బందికరంగా తయారైందని డ్రైనేజీని పూడిక తీయడంతో పాటు నూతనంగా డ్రైనేజీ నిర్మించడానికి దుకాణాల ముందు నిర్మించుకున్న వాటిని వారం రోజుల్లోగా తొలగించాలని లేనిపక్షంలో చట్ట ప్రకారం మున్సిపల్ సిబ్బంది షెడ్లను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది సతీష్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## సన్ వే పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు




కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14




బీర్కూరు మండల కేంద్రంలోని సన్ వే ప్రైవేటు పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులు వేషాధారణలో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపల్ నాగ పరమేశ్వరరావు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేఖర్ యాదవ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఎరాజ్ పల్లిలో సమగ్ర సర్వేను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి...

కబురు న్యూస్,బోధన్ నవంబర్14..



బోధన్ మండలంలో చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను బోధన్ మండల ప్రత్యేక అధికారి విజయకుమార్, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ పరిశీలించారు. చేపడుతున్న సర్వేలో భాగంగా గురువారం మండలంలోని ఎరాజ్ పల్లి గ్రామంలో ఎన్యూమరేటర్లు చేపడుతున్న సర్వే తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేను స్పష్టంగా తప్పులు దొర్లకొండ, త్వరగా పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్, ఏపీవో హేమలత పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లెవీ సేకరణ,ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో మంత్రి సమీక్ష







**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్, నవంబర్ 14 :**
లెవీ సేకరణ, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్టేట్ ఛాంబర్లో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి,భూపతి రెడ్డి,రాకేష్ రెడ్డి,కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి ధాన్యం కొనుగోళ్ల తీరుతెన్నులపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు.ఎవరూ ఏ విషయంలోనూ ప్రశ్నించే పరిస్థితి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు జరపాలని,రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలపాలని మంత్రి హితవు పలికారు.ముఖ్యంగా రైతులు రైస్ మిల్లుల వద్ద నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల వద్దనే వారికి సమగ్ర వివరాలతో కూడిన రసీదులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎక్కడ కూడా పొరపాట్లకు ఆస్కారం కల్పించకూడదని,తప్పిదాలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.కాగా,డిఫాల్టర్లుగా లేని రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలని సూచించారు.ధాన్యం మిల్లింగ్ అయిన వెంటనే బియ్యాన్ని సివిల్ సప్లైస్ గోడౌన్లకు తరలించాలన్నారు.వచ్చే జనవరి మాసం నుండి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నందున ఒక్క బియ్యం గింజ కూడా చెడిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు.కాగా,ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా మిల్లింగ్ జరిపి బియ్యం నిల్వలను తిరిగి అందించడంలో విఫలమైన రైస్ మిల్లర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి సంబంధిత అధికారులను ఆదేశించారు. లెవీ లక్ష్యానికి విఘాతం కల్పించిన మిల్లర్లపై అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టును ప్రయోగించాలని అన్నారు.మరో పది రోజులలోపు తాను ఇదే అంశంపై ప్రత్యేకంగా సమీక్ష జరుపుతానని,ఆ లోపు డిఫాల్ట్ మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే పూర్తి వివరాలతో తనకు నివేదికను సమర్పించాలని ఆదేశించారు.సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్,బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను సత్కరించిన పాఠశాల యాజమాన్యం

**కబురు న్యూస్ బిచ్కుంద, నవంబర్ 14**
బిచ్కుంద మండల కేంద్రంలోని విశ్వభారతి పాఠశాలలో విద్యనభ్యసించి ఉద్యోగాలు పొందిన పూర్వ విద్యార్థులను గురువారం పాఠశాల యాజమాన్యం శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగాలు పొందిన పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, సంతోష్, సూర్యకాంత్, అనిల్ రెడ్డి, శివ ప్రశాంత్ గౌడ్, శ్రీధర్, సాదక్, దీపిక పటేల్,శృతిక,అవినాష్, శ్రీకాంత్, జ్ఞానేశ్వర్లను పాఠశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సాయిలు మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందినందుకు తాము ఎంతో గర్విస్తున్నామని, ఉద్యోగ జీవితంలో రాణించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాల్చార్ రాజు, పాఠశాల ప్రిన్సిపల్ సాయిలు, ఉపాధ్యాయులు సంగ్రామ్, బసంత్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు చిన్ననాటి నుండి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.... జడ్జి టిఎస్పి భార్గవి






**కబురు న్యూస్, బాన్సువాడ, నవంబర్ 14**
బాన్సువాడ మండలంలోని కోయ్యగుట్టలోని బాలికల గురుకుల పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయ సేవ అధికారిక సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి మాట్లాడుతూ విద్యార్థినిలు చిన్ననాటి నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోవద్దని, బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు తమ పరిసరాల్లో ఉన్న ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీబాయి, న్యాయవాదులు ఖలీల్, ఎస్పై మోహన్, ఉపాధ్యాయిని బృందం, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు.





**కబురు న్యూస్,బోధన్ నవంబర్ 14..**
పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రత పూజ కార్యక్రమాలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని 86 మంది దంపతులు ఈ పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా నూతన్ టెంట్ హౌస్ యజమాని సంజీవ్ రెడ్డి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభి వృద్ధి కమిటీ చైర్మన్ హరి కాంత్ చారి, ధర్మకర్తలు సింగం లక్ష్మణ్, కమల, భూమేష్, ఆలయ ఈవో రవీందర్, లక్ష్మి నారాయణ స్వామి దేవస్థానం ఇఓ రాములు, ఆలయ అర్చకులు గణేష్ శర్మ, మహేష్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన కుడికాల భాస్కర్

**రబురు న్యూస్, హుజురాబాద్/ ప్రతినిధి:నవంబర్ 13,**
హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామ కారోబారి చిలకమారి రాజమౌళి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుమారులైన పాత్రికేయుడు చిలుకమారి సత్యరాజ్, కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం నాయకుడు చిలుక మారి శ్రీనివాసులను పరామర్శించి చిత్రపటానికి పూలతో శ్రద్ధాంజలి ఘటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరి స్వర్గలోక ప్రాప్తి కలగాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కుడికాల భాస్కర్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు జడల చిరంజీవి, హుజురాబాద్, నియోజకవర్గం అధ్యక్షుడు కుడికాల సాయి, కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం నాయకుడు సంగెం సత్యనారాయణ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రైతుకు నష్టం వాటిల్లకుండా పకడ్బందీ చర్యలు

- జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు...
- ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన...
- ప్రతి రైతుకు పూర్తి మద్దతు ధర అందిస్తామని వెల్లడి...
- సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ చెల్లింపు...
- ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రతి కేంద్రానికి ఓ అధికారి నియామకం...
- తరుగు,కడ్తా పేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక...
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను పునరావృతం కానివ్వబోమని స్పష్టీకరణ...









**కబురు న్యూస్,నిజామాబాద్,నవంబర్ 14 :**
ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతు పంట అమ్మకాల సందర్భంగా ఏ దశలోను నష్టపోకుండా తమ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందని జిల్లా ఇన్చార్జ్ మంత్రి,రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.నిజామాబాద్ జిల్లాలో గురువారం స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి జూపల్లిసుడిగాలి పర్యటన జరిపారు. డిచ్పల్లి మండలం మెంట్రాజ్ పల్లి, ఆర్మూర్ మండలం పెర్కిట్, ఎడపల్లి మండలం ఠాణాకలాన్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న సదుపాయాలు తనిఖీ చేశారు.మాయిశ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని మంత్రి స్వయంగా కొలిచారు.కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులను పలకరించి,ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతుల నుండి సేకరించిన ధాన్యం వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ,రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వారికి మద్దతు ధర,బోనస్,ధాన్యం రకం,ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు,బిల్లు రూపేణా ఎంత మొత్తం చెల్లించబడుతుంది తదితర అన్ని వివరాలు పొందుపరుస్తూ రైతుకు సంబంధిత అధికారి సంతకంతో కూడిన రసీదు అందించాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రం నుండి ధాన్యం నిల్వలు రైస్ మిల్లుకు రవాణా చేయడానికి ముందే విధిగా రైతుకు రశీదు ఇవ్వాలన్నారు.దీనివల్ల రైతులు రైస్ మిల్లుల వద్ద కోతల పేరిట నష్టపోకుండా నిలువరించవచ్చని సూచించారు.ఎక్కడ కూడా తరుగు, కడ్తా పేరుతో కోతలు విధించకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి ఒక అధికారి చొప్పున నియమించాలని,అవసరమైతే ఇతర శాఖల అధికారులకు ధాన్యం సేకరణపై శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక్క రైతు నష్టపోవడానికి వీలు లేదని,దళారీల ప్రమేయం లేకుండా చూడాలని అన్నారు.రైతుకు నష్టం చేకూర్చే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, లోపాలు పునరావృతం కాకుండా నిరంతరం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు.ఏ గ్రేడ్ ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 2320 తో పాటు సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని,ఏ విషయంలో రైతులు ఎలాంటి అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని మంత్రి జూపల్లి భరోసా కల్పించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి లేకుండా వెంటవెంటనే కాంటాలు జరపాలని,బిల్లుల చెల్లింపులలో జాప్యానికి తావులేకుండా త్వరితగతిన టాబ్ ఎంట్రీలు చేయాలని అధికారులను ఆదేశించారు.పూర్తి పారదర్శకంగా,స్పష్టతను పాటిస్తూ రైతుల నుంచి ఏ చిన్న ఫిర్యాదుకు సైతం ఆస్కారం లేకుండా కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని హితవు పలికారు.కాగా,75 సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్,టీడీపీ ప్రభుత్వాలు 60 వేల కోట్ల అప్పులు మాత్రమే చేయగా,గత ప్రభుత్వం పదేళ్ల పాలనలోనే 8 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిందని,మంత్రి జూపల్లి ఆక్షేపించారు.ఈ అప్పులపై వడ్డీ రూపంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రతీ నెలా రూ. 6వేల కోట్లు చెల్లిస్తోందని తెలిపారు.ఇలా తీవ్రమైన ఆర్థిక భారం ఉన్నప్పటికీ,ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్,మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం,రూ.500 లకు వంట గ్యాస్,రైతులకు పంట రుణాల మాఫీ తదితర వాటన్నింటిని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు.అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ అర్హులైన రైతులకు రైతు భరోసా కింద తప్పనిసరిగా లబ్ది చేకూరుస్తామని స్పష్టం చేశారు.సుమారు 20 వేల కోట్లను వెచ్చిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3మొదటి విడతగా 3500 గృహాలను ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలనే కుట్రతో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు.

ఇంటింటి సర్వే పరిశీలన

కాగా,అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.డిచ్పల్లి మండలం మెంట్రాజ్ పల్లిలో సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాల వారికి సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా లబ్ది చేకూర్చేందుకే ప్రభుత్వం సమగ్ర సర్వే జరిపిస్తోందని అన్నారు.అనంతరం స్థానిక రైతు వేదికలో మంత్రి రైతులతో భేటీ అయ్యారు.మంత్రి వెంట ఎమ్మెల్యేలు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి,పి.రాకేష్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

18

1888

# అర్థిదారులు ఖరీద్ దారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వినతి పత్రం

**కబురు న్యూస్, జమ్మికుంట నవంబర్ 14**
జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కి వివిధ జిల్లాలు మండలాల నుండి వందలాది వాహనాల లో పత్తి అమ్ముకోవడానికి రైతులు రోజు మార్కెట్ కు రావడం జరుగుతుంది. వచ్చే రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఆర్తి దారులు ఖరీదారులు కుమ్మక్కై మార్కెట్లో గ్రేడింగ్ చేసేటప్పుడు



6950/- రూపాయల ధరతో గ్రేడింగ్ చేశాక తీరా రైతులు వారు తీసుకొచ్చిన పత్తిని వాహనాలలో జిన్నింగ్ మిల్లుకు వెళ్లేసరికి మార్కెట్ లో ఒక రేటు జిన్నింగ్ మిల్లులో మరో రేటుతో 6800/- 6550/- రూపాయలకే దించుకుంటాం నీ ఇష్టం ఉంటే ఇవ్వు లేకపోతే లేదు అని పత్తి రైతును నిలువునా ముంచుతున్న పత్తి వ్యాపారులు. నిత్యం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న అర్తి దారులు మరియు పత్తి వ్యాపారస్తులపై తక్షణమే ఉన్నంత అధికారులు స్పందించి శాఖాపరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చెల్పూరి రాము. గుండెటీ వాసుదేవ్ పాల్గొన్నారు

# లగచర్లలో దాడికి పాల్పడిన వాళ్లను కఠినంగా శిక్షించాలి




**– టిజిఇజేఏసి నిజామాబాద్ జిల్లా శాఖ నిరసన...**

**– మద్దతు తెలిపిన ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలు...**

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, నవంబర్ 14 :
విధి నిర్వహణలో భాగంగా వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామసభలో పాల్గొనడానికి వచ్చిన వికారాబాద్ జిల్లా కలెక్టర్,కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి,కొడంగల్ తాసిల్దార్ మరియు ఇతర రెవెన్యూ సిబ్బందిపై దాడిని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా ఖండించింది.నిజామాబాద్ జిల్లా పక్షాన గురువారం నిరసన వ్యక్తం చేశారు.దాడులకు పాల్పడడం వంటి హేయమైన చర్యల వల్ల ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని వారికి భద్రత లేకుండా పోతుందని వారు వాపోయారు.ప్రభుత్వం వెంటనే స్పందించి,కుట్ర పూరితంగా దాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్,కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ అధికారి,కొడంగల్ తాసిల్దార్ మరియు ఇతర రెవెన్యూ సిబ్బందిపై దాడికి గాను ప్రభుత్వం వెంటనే స్పందించి,ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను అరికట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉద్యోగులపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని ఉద్యోగ సంఘం నిజాంబాద్ జిల్లా నాయకులు తెలిపారు.తెలంగాణ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల,జేఏసీ రెవెన్యూ ఉద్యోగులకు సంఘీభావంగా తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం రోజున నిజామాబాద్ జిల్లా నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయల సముదాయం ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాలో పాల్గొని,నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నిజాంబాద్ జిల్లా ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై తమ నిరసన తెలిపారు.ఈకార్యక్రమంలో టిఎన్జిఓస్ జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్,జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్,టిజిఓ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్,కార్యదర్శి సంగం అమృత్ కుమార్, టిజిఆర్ఈఎస్ఏ జిల్లా అధ్యక్షులు రమన్ రెడ్డి కార్యదర్శి ప్రశాంత్,పీఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి,కార్యదర్శి కిషన్ డిస్టిక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యోహాన్,రిటైర్డ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు రవీందర్,టీఎన్జీవో కేంద్ర బాధ్యులు గైని గంగారం,పోల శ్రీనివాస్, మచ్చుకూరి సతీష్,దివ్యాంగుల ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి లు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి



– ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి...(కె. రామనారాయణ)





కబురు న్యూస్,డెహ్రాడూన్,నవంబర్ 14 :
ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యవర్గ సమావేశాలు గురువారం నాడు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ లో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి.ఈ సమావేశాలకు ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఉత్తరాఖండ్ రాష్ట్ర అటవీశాఖ మంత్రి సుబోధ్ అనియాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అంతకుముందు శ్రీనివాస్ రెడ్డి సమావేశాన్ని ప్రారంభిస్తూ,దేశంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని,వారికి ప్రత్యేక రక్షణ చట్టం కావాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ పై జర్నలిస్ట్ సమాజంలో చర్చ జరుగుతున్నదని,తమ సంఘం దీనిపై వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టిందని తెలిపారు.జర్నలిస్టులకు స్వేచ్ఛకావాలని అందుకు తాము కట్టుబడి ఉన్నామని చెపుతున్న పాలకులు ప్రత్యేక రక్షణ చట్టం తేకపోవడం విచారకరమన్నారు.జర్నలిస్టులకు1955 లో ఆనాటి పార్లమెంట్ చేసిన వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ను నేడు మరింత పటిష్టం చేయాల్సింది పోయి అందుకు విరుద్ధంగా కార్మిక చట్టాల కోడిఫికేషన్ పేరుతో దాన్ని పూర్తిగా రద్దు చేయడం ఆందోళనకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు.కొత్తగా తెచ్చిన బిల్లును దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని అన్నారు.తమ సంఘం కూడా దీనిపై నిరసనలు,ఆందోళనలు పెద్దఎత్తున చేపట్టిందన్నారు.ప్రస్తుతానికి పెండింగులో ఉన్న ఈ బిల్లును తిరిగి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం శోచనీయమన్నారు.గతంలో ఉన్న చట్టంస్థానే కొత్త చట్టం వస్తున్నదంటే గతం కంటే ఎక్కువ ఉపయోగాలు జర్నలిస్టులకు ఉండేలా బిల్లు ఉండాలి తప్ప గతంలో ఉన్న సౌకర్యాలను తగ్గిస్తూ,నిర్ణయాలు తీసుకోవడం తగదని శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వానికి హితవు పలికారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్తుకు నిర్మాతలు

**-ఆటల్లోనైనా..జీవితంలోనైనా గెలుపోటములు సహజం**

**-అమ్మాయిలు అధైర్యం, అభద్రతకు గురికాకూడదు**

**-రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**




కబురు న్యూస్, సంగారెడ్డి ప్రతినిధి:
ఆటల్లోనైనా, జీవితంలోనైనా గెలుపోటములు సహజమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్ లోని ప్రభుత్వ గురుకుల పాఠశాల, గర్ల్స్ జూనియర్ కాలేజీలో జరిగిన టెంత్ జోనల్ లెవల్ ఆటలు అండ్ క్రీడల మీట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి గురువారం ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అబ్బాయిల కంటే ఈ అమ్మాయిలు తక్కువ కాదని ఆయన అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు అధైర్యం, అభద్రతకు గురికాకూడదు, నమ్మకంగా అన్నిరంగాల్లో ముందుకెళ్లాలన్నారు. స్వేచ్ఛ అనేది మన జన్మ హక్కు కావున ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించాలని ఆయన సూచించారు. స్పోర్టీవ్‌గా తీసుకుని ముందుకెళ్లాలి. మరోసారి ఆడి గెలిచేందుకు శక్తిని కూడదీసుకుని సాధన చేయాలని.ఇప్పుడు చదువుల్లో పడి క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారు. కానీ, విద్యతో పాటు సంస్కృతి, క్రీడలు కూడా చాలా ముఖ్యం అన్నారు. ప్రతి విద్యార్థినిలు తమకు నచ్చిన ఆటలు ఆడాలి. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఫిజికల్‌గా, మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటారని, పోటీతత్వాన్ని అలవర్చుకుంటారు. ఒత్తిడిని తట్టుకునే శక్తిని, నాణ్యతతో కూడిన నాయకత్వ లక్షణం సంపాదించుకుంటారని అన్నారు. ఇవన్నీ ఇప్పటి జీవన విధానంలో చాలా అవసరం, జీవితంలో ఎదగటానికి ఎంతగానో ఉపయోగపడుతాయని,అమ్మాయిలు చదువుల్లో, ఆటల్లో రాణించడంతో పాటు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, సమకాలిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అకాడమిక్ బుక్స్‌తో పాటు, చరిత్రకు సంబంధించిన పుస్తకాలు కూడా చదవాలి. మీ స్కూల్‌లో లైబ్రరీ ఏర్పాటు చేస్తాం. అన్ని బుక్స్ అందజేస్తాం. మీకు కావాల్సిన ప్రతి సౌకర్యాన్ని కల్పిస్తాం. ప్రతిరోజు విద్యార్థిని లైబ్రరీకి వెళ్లాలి. మీకు నచ్చిన పుస్తకం చదవాలి.తల్లిని, తండ్రిని, గురువులను జీవితాంతం మరవకూడదని మన సంస్కృతి చెబుతోంది. మీరంతా దాన్ని పాటించాలి. మీ పాఠశాలను, కాలేజీని మీరు ఓన్ చేసుకోవాలి.ఈ సమాజంలో మీరు కూడా భాగమేనని గుర్తుంచుకోవాలి.మీరు ఎదిగిన తర్వాత సమాజానికి తమ వంతు సాయం చేయాలని మంత్రి విద్యార్థులకు తెలిపారు.క్రీడల్లో గెలుపొందిన విద్యార్థిణులకు మంత్రి బహుమతులు అందజేశారు. విద్యార్థినిలతో కలిసి మంత్రి కబడ్డీ ఆడి వారిని అందర్నీ ఉత్సాహపరిచారు. ఆటలు, క్రీడల్లో పాల్గొన్న విద్యార్థిణులందరికీ అభినందనలు తెలిపారు. బాలల దినోత్సవ సందర్భంగా మంత్రి విద్యార్థిణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, అనాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలువురి కుటుంబాలను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు




కబురు న్యూస్, న్యూస్ కోరుట్ల: నవంబర్ 14
కోరుట్ల పట్టణానికి చెందిన చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్ సమీప బంధువును, రాతల పంపు కు చెందిన గుర్రాల ప్రవీణ్ తండ్రి గుర్రాల రాములు నిన్న మరణించగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుజువ్వాడి కృష్ణారావు ఈరోజు పట్టణంలో రాములు కుమారుడు ప్రవీణ్ ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట కోరుట్ల పట్టణ కౌన్సిలర్ నాగభూషణం పుప్పాల ప్రభాకర్ తిరుమల గంగాధర్ తదితరులు ఉన్నారు

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



కబురు న్యూస్, న్యూస్ ఎండపల్లి: నవంబర్ 14
మండలంలోని గుల్లకోట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకను పురస్కరించుకుని పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించి దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశ తొలి ప్రధానిగా దేశాభివృద్ధికి, పంచవర్ష ప్రణాళికలు ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన నెహ్రూ కి పిల్లలంటే,అలాగే గులాబీ పువ్వులు అంటే చాలా ఇష్టమని అలాగే ప్రభుత్వం నెహ్రూ మరణాంతరం నెహ్రూ పుట్టినరోజును జాతీయ బాలల దినోత్సవం గా జరుపుకుంటున్నారు, ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన పలు కార్యక్రమాలు ప్రముఖులను విశేషంగా ఆకట్టుకున్నాయి, అబ్బుర పరిచాయి,అలాగే పిల్లలు ఉపాధ్యాయులుగా స్వయంపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి , ఉపాధ్యాయ బృందం కృష్ణా రెడ్డి,రమాదేవి,మాలతి,ప్రశాంత్, నరేష్ ,శిరీష,బోధనేతర సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

## నేడు శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం,రుద్రాభిషేకం

**– ప్రత్యేక పూజలో పాల్గొననున్న డాక్టర్ గురువారెడ్డి దంపతులు**



కబురు న్యూస్, న్యూస్ ఎండపల్లి: నవంబర్ 14
మండలం లోని కొండాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ డి రాజిరెడ్డి కుమారుడు రాష్ట్ర ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగిత్యాల ప్రముఖ వైద్యులు డాక్టర్ డి గురువారెడ్డి శిరీష దంపతులు ఆధ్వర్యంలో ఉదయం కాలం రుద్రాభిషేకం తర్వాత శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణ మహోత్సవం విజయవంతం చేయగలరని నిర్వాహకులు తెలిపారు

## మల్లాపూర్ పద్మశాలి సంఘ భవనానినికి ఎంపి నిధులు విడుదల



కబురు న్యూస్, మల్లాపూర్ నవంబర్ 14
మల్లాపూర్ మండలం కేంద్రం లోని నందిచౌరస్తా పద్మశాలి సంఘ భవన నిర్మాణం కొరకు నిజామాబాదు ఎంపి ధర్మపురి అరవింద్ ఎంపి నిధుల నుండి నాలుగు లక్షలు కేటాయించి నట్టు పద్మశాలి మండల అధ్యక్షులు సిరిపురం రవీందర్ మరియు పద్మశాలి ప్రచార కార్యదర్శి మోర సతీష్ తెలిపారు ఇట్టి నిధుల విడుదల కి సహకరించిన భారతీయ జనతా పార్టీ మండలం అధ్యక్షులు గోపిడీ శ్రీనివాస్ రెడ్డి మరియు పద్మశాలి నాయకులు రుద్ర శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## చిరు వ్యాపారులకు సుదాన్ గొడుగులు పంపిణీ.

**– గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ జోగ నవీన్.**

కబురు న్యూస్, ప్రతినిధి, మెట్ పల్లి, నవంబర్ 14.



గోదావరి అర్బన్ బ్యాంక్ మెట్టుపల్లి శాఖ వారి ఆధ్వర్యంలో ఎండలో చిరు వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారస్తులకు సుధాన్ గోల్డ్ లోన్ గోడుగులు గురువారం మెట్పల్లి గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ జోగ నవీన్ మెట్టుపల్లి , కోరుట్ల పట్టణంలో పంపిణీ చేశారు. మేనేజర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బ్యాంకు తరపున చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ జోగనవీన్ , అన్నపూర్ణ, నవీన్ ప్రదీప్ ,గణేష్ ,రసూల్ పాల్గొన్నారు

## ఘనంగా వేంపేటలో విద్యార్థులతో స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమం.




కబురు న్యూస్, మెట్ పల్లి, నవంబర్ 14.

జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలంలోని ఎం పి పి ఎస్ వెంపేట్ పాఠశాలలో విద్యార్థులతో స్వయం పరిపాలన దినోత్సవం గురువారం ఘనంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరు మహేందర్ రెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని జవహర్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివారులు అర్పించడం జరిగింది.ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ విద్యాభిమాని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ అల్లూరి మహేందర్ రెడ్డి పాల్గొని మాజీ ప్రధాని నెహ్రూ కు చిన్న పిల్లలు అంటే చాలా ఇష్టం అన్ని అందుకే ఈ రోజు బాలల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది అన్ని అన్నారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ఏ ఏ పి సి చైర్మన్ శ్రీమతి ఎలాల రమ , ప్రధానోపాధ్యాయులు శ్రీ కోటగిరి నర్సయ్య , ఉపాధ్యాయులు శ్రీనివాస్ , కుమారస్వామి ,అంగన్ వాడి టీచర్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా జోహార్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు.

కబురు న్యూస్, మెట్ పల్లి, నవంబర్ 14.



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి, చివరి క్షణం వరకు దేశం కోసం బ్రతికిన భారతరత్న పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసములో కల్వకుంట్ల సుజీత్ రావు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు జరిపారు, బాల బాలికలందరికి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ,కాంగ్రెస్ నాయకులు ఖుతుబొద్దీన్ పాషా, వాకిటి సత్యం రెడ్డి, రుత్త నారాయణ, అందె మారుతి బాపూజీ ,కూన రాకేష్, గిరి బైండ్ల శ్రీకాంత్, నాగరాజు ,దినేష్, శేఖర్ రెడ్డి, కట్ట మనోజ్, మోహన్ రెడ్డి, జాఫర్ ,అమ్ముల పవన్ ,భరత్, ముద్దం ప్రశాంత్, మల్లేష్ యాదవ్ ,మజ్జు రాజేందర్ , నరేందర్ రెడ్డి, ప్రతాప్ ,వాల్గొండ నరసయ్య, అన్వర్, తదిరితులు పాల్గొన్నారు

## డబ్బా ప్రభుత్వ పాఠశాల లో ఘనంగా బాలల దినోత్సవం

కబురు న్యూస్, మెట్ పల్లి, నవంబర్ 14.



జగిత్యాల జిల్లా మెట్టుపల్లి రెవిన్యూ డివిజన్ ఇబ్రహీంపట్నం మండలం డబ్బా ప్రభుత్వ పాఠశాల లో గురువారం ఘనంగా బాలల దినోత్సవం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు స్వయం పరి పాలన నిర్వహించి పిల్లలే ఉపాధ్యాయులు గా వ్యవహరించారు ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ తనుగుల రమేష్ , అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్రీమతి లింగంపల్లి లక్ష్మి , ఉపాధ్యాయులు శ్రీ మండలోజు అశోక్ , అల్లకట్టు సత్యనారాయణ , చిలుముల రాజేష్ , అల్లాడి హరి ప్రసాద్, ఆడెపు నరేష్ గారు, బొల్లు శంకర్ వేముల నర్సయ్య సార్ లు విద్యార్థులు ,పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో ప్రధాన ఉపాధ్యాయులు గా బ్లెస్సికా 8 వ తరగతి విద్యార్థిని, పి. ఈ టి గా మహీధర్, ఉపాధ్యాయులు గా శాశ్వత శ్రీ, నిహారిక, శ్రీ విద్య, అశ్లేష,సిద్దార్థ లు హన్సిక్ గా వ్యవహరించారు

## మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తాను.

...నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్.

కబురు న్యూస్, మెట్ పల్లి, నవంబర్ 14.



మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం నూతన పాలకవర్గ చైర్మన్ ఎన్నికైన కూన గోవర్ధన్ బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గ చైర్మన్ కూన గోవర్ధన్ కార్యాలయంకు రాగా వ్యవసాయ కమిటీ కార్యదర్శి ఎం ఇంద్రసేనారెడ్డి పుష్పగుచ్చాలతో ఆహ్వానం పలికారు.అనంతరం పదవి బాధ్యతల సంతకాలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన కూన గోవర్ధన్ మాట్లాడుతూ తమ గురువు కల్వకుంట్ల సుజిత్ రావు ఆశీస్సులతో చైర్మన్ బాధ్యత తీసుకున్నానని వారికి జిల్లా చీఫ్ విప్ మరి ఎమ్మెల్సీ ఉమ్మడి జిల్లా మంత్రి గార్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు, అలాగే ఈ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని రైతులకు నష్టం కాకుండా కార్యాలయ అధికారుల సహకారంతో వ్యవసాయ మార్కెట్ ని అభివృద్ధి చేస్తానని నూతన భవన నిర్మాణానికి కల్వకుంట్ల సుజిత్ రావు సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని అన్నారు .అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కూన గోవర్ధన్ పిసిసి డెలికేట్ కల్వకుంట్ల సుజిత్ రావు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం కార్యాలయ కార్యదర్శి సిబ్బంది, పలువురు సన్మానం చేసి అభినందించారు . ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం ఇంద్రసేనారెడ్డి, సూపర్వైజర్ హరికృష్ణ, పాలక వర్గ సభ్యులు మానాల లింగారెడ్డి, అందే భవిత, రైతు నాయకులు సత్యం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు కుదుబుద్దిన్ పాష, కల్లెడ గంగాధర్ ,నారాయణ, శేఖర్ రెడ్డి, భరత్ ,వికాస్, శ్రీకాంత్, గిరి ,తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 30 వరకు ప్రజలుఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి.

కబురు న్యూస్, మెట్ పల్లి, నవంబర్ 14. జగిత్యాల జిల్లా



మెట్టుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల ఒకటో తారీకు నుంచి 30 తారీకు వరకు ఉచిత మధుమోహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు మెట్పల్లి పట్టణంలో పలు కూడలలో జరుగుతున్నది, ఈరోజు కొత్త బస్టాండ్ వద్ద ఉచిత డయాబెటిక్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగాయి ఈరోజు ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు ప్రజలకు నివారణ కరపత్రాలు విడుదల చేశారు అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు ర్యాలీ తీశారు.లయన్స్ డాక్టర్ దిలీప్ రావు 320జి డిస్టిక్ చీఫ్ కోఆర్డినేటర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మెట్పల్లి లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరము నవంబర్ ఒకటో తారీకు నుండి 30 తారీఖు వరకు పట్టణంలో పలు ప్రాంతాల్లో ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ షుగర్ నిర్ధారణ పరీక్షలు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని, వచ్చినవారు జీవితకాలం మందులు క్రమం తప్పకుండా వాడాలని భయపడే అవసరం లేదని తెలిపారు. ఆహార జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని రాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ షుగర్ వ్యాధి రాదని ప్రతి ఒక్కరూ దీని పై అవగాహన చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అనంతరంలయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచితంగా నెలరోజుల పాటు జరుగుతున్న డయాబెటిక్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు పట్టణ, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు లయన్స్ క్లబ్ మెట్పల్లి ద్వారా సంవత్సరం 8.సార్లు కంటి వైద్య శిబిరం రెండుసార్లు గుండె వైద్య శిబిరం చేస్తామని ఇటీవల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని పట్టణ గ్రామీణ ప్రజలు అత్యధిక మంది సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు . ప్రభుత్వ పాఠశాలలో గాని హాస్టల్లో గాని ఇతర పేదవారికి ఫుట్పాత్ వ్యాపారులకు గొడుగులు లయన్స్ క్లబ్ ద్వారా ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. పట్టణ గ్రామీణ ప్రజలు లయన్స్ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు .

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్, సెక్రెటరీ గూండా రాకేష్ క్యాషియర్ నాంపల్లి వేణు గోపాల్, జడ్ చి గడ్డం శంకర్ రెడ్డి, వడ్డేపల్లి శ్రీనివాస్ , అల్లాడి ప్రవీణ్ ,చాప కిషోర్, ఉషా కిరణ్ ,ప్రొహార్ తుకారాం, గంగుల మురళి ,దొంతుల ఆంజనేయులు, భాష నర్సింగారావు, వెల్మల శ్రీనివాస్ ,మర్రి భాస్కర్, బొమ్మెన శంకర్ , వాసే, గంగాధర్ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఏ ఒక్క చిరు వ్యాపారికి కూడా అన్యాయం జరగదు

» చిరు వ్యాపారస్తులకు అండగా నేనున్నా ఎవరు కూడా అ ధైర్య పడకండి
» ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్



కబురు న్యూస్, రామగుండం నవంబర్, 14: గోదావరిఖని ప్రధాన చౌరస్తా, లక్ష్మీ నగర్ లో పట్టణ సుందరి కరణనలో భాగంగా సింగరేణి ఆర్జీ వన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.ఇ సందర్భంగా చిరు వ్యాపారస్తులు వారికున్న అపోహలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా చిరు వ్యాపారస్తులకు నేనున్నానంటూ ఏ ఒక్క చిరు వ్యాపారికి కూడా అన్యాయం జరగదు అంటూ భరోసా కల్పించిన రామగుండం ఎమ్మెల్యే. సుందరీకరణ, లో భాగంగా రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు

## సింగరేణి సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం వాడుకునే హక్కు లేదు

- సొమ్ము సింగరేణి ది ప్రచారం రాష్ట్ర ప్రభుత్వానిది.
- ఏఐటియుసి లో చేరిన ఆర్జీ వన్ సివిల్ డిపార్ట్మెంట్ కార్మికులు.
- కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించిన సీతారామయ్య.




కబురు న్యూస్, రామగుండం నవంబర్,14: సింగరేణి లో రాజకీయ జోక్యం గత పాలక ప్రభుత్వం బి అర్ ఎస్ కంటె కాంగ్రెస్ ప్రభుత్వ పెత్తనం ఎక్కువగా ఉందని, సింగరేణి సొమ్ము ను విచ్చలవిడిగా వాడుకుంటూ ప్రచారం మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంటుందని, రాష్ట్రంలో మార్పు అంటే ఇదేనా అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు . గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో గురువారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. సింగరేణి లో, రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగులు ప్రజలు మార్పు కోరుకుంటే సింగరేణి లో ఏఐటియుసి ని గుర్తింపు సంఘం గా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ని గెలిపిస్తే, సింగరేణి సొమ్ము ను రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కు, అభివృద్ధి పనుల కోసం వాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం మేమే చేసామని గొప్పగా ప్రచారం చేసుకోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. సింగరేణి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కాదని, ప్రభుత్వ రంగ సంస్థ అని, సింగరేణి సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం వాడుకునె హక్కు లేదని ఆయన అన్నారు. సింగరేణి సంస్థ స్వచ్ఛంద మని దానికి లాభాలు వచ్చిన, నష్టాలు వచ్చిన సింగరేణి కే సంబందం అని, నష్టం వస్తె రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బడ్జెట్ సపోర్ట్ చేయదని ఆయన అన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ 33 వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు వస్తెనె సింగరేణి మనుగడ కొనసాగుతుందని ఆయన అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించిందని, దీని వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల కు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటియుసి తో పాటు పలు కార్మిక సంఘాలు పోరాటాలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. సింగరేణి లో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు స్ట్రక్చర్ మీటింగు లు పెట్టాలని యాజమాన్యం ను కోరడం జరిగిందని ఆయన అన్నారు.

ఏఐటియుసి లో చేరిన సివిల్ డిపార్ట్మెంట్ కార్మికులు

సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని సివిల్ డిపార్ట్మెంట్ లో పని చేస్తున్న కార్మికులు మరియు వివిధ యూనియన్ లో పని చేస్తున్న నాయకులు ఏఐటియుసి లో చేరిన సందర్భంగా వారికి సీతారామయ్య కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. యూనియన్ లోకి వచ్చిన వారికి ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కమిటీ శు భాకాంక్షలు తెలపడం జరిగింది. ఏఐటియుసి సివిల్ డిపార్ట్మెంట్ సలహాదారు బిట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా లు వారి నుద్దేశించి ప్రసంగించారు, నాయకులు నర్సింగరావు, ఆకునూరి శంకరయ్య, అటికేటి రాజు, వొన్నాల లక్ష్మి నారాయణ, జెరిపోతుల దేవయ్య, దాసరి శ్రీనివాస్, మేకల లింగయ్య, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఏఐటియుసి లో చేరిన వారిలో తోట చెంద్రయ్య, బడుగు శంకరయ్య, బియ్యాల రామకృష్ణ, పుల్లూరి సాగర్, సంద రవిందర్, పొలసాని మహర్షి, బిక్షపతి, మిట్టపెల్లి మొగిలి, మిడివెల్లి రవిందర్, వెంకటస్వామి లు తదితరులు ఉన్నారు.

## గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

కబురు న్యూస్, రామగుండం నవంబర్, 14 :




గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉద్యోగ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య అనఘా మల్టీ స్టేట్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారితో కలిసి కళాశాల తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్యర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్ మేళా లో సుమారు 60 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కొఆపరేటివ్ బ్యాంక్ లో ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు గోదావరిఖని, మంథని బ్రాంచ్ లో పోస్టింగ్ ఇస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జై కిసాన్ ఓజా మాట్లాడుతూ ఇలాంటి బాధ్యతతో కూడుకున్న జాబ్ మేళాలు,జాబ్ డ్రైవ్ లు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లో నిర్వహించడం చాలా సంతోషకరమని అన్నారు. అర్హులైన అభ్యర్థులందరు ఇంటర్వ్యూలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆదిత్య అనఘా మల్టీ స్టేట్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంక్ అసిస్టెంట్ జోనల్ మేనేజర్ రాజేష్ కేదార్ మరియు డివిజనల్ మేనేజర్ వైభవ్ గారు, కళాశాల టి ఎస్ కె ఎస్ కోఆర్డినేటర్ అండ్ ప్లేస్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. సుబ్బారావు, మెంటార్,పి.ఉషా రాణి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.సాంబశివరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి సవితా,, ప్లేస్మెంట్ సెల్ సభ్యులు బి.తిరుపతి,డా.శంకరయ్య, డా. శారదా, డా.కిరణ్మయి, శ్రీదేవి, డా. సురేష్, డా.నరేష్, డా.రామకృష్ణ ఇతర అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవమే నెహ్రూ జన్మదినోత్సవం..

కాంగ్రెస్ నాయకులు జవ్వాడి కృష్ణారావు

కబురు న్యూస్, కోరుట్ల::: నవంబర్ 14

**భారత జాతి నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నివాళులు - కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జవ్వాడి కృష్ణారావు**

జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలోని జువ్వాడి భవన్ లో తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నివాళులు అర్పించడం జరిగింది... ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ బ్రిటీష్ వారి పాలన నుండి మన స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధుడు అని, దేశం కోసం 15 ఏళ్ల పాటు జైలు జీవితం గడిపిన మహనీయుడని, భారతదేశ తొలి ప్రధానిగా 16 సంవత్సరాలు ఆయన చేసిన సేవలు దేశ అభివృద్ధికి పునాదులు పడ్డాయి అని, పండిత్‌జీ గా ప్రాచుర్యం పొందిన ఈయన రచయిత, పండితుడు, చరిత్రకారుడు కూడా. భారత రాజకీయలలో శక్తివంతమైన నెహ్రూ-గాంధీ కుటుంబానికి ఈయనే మూలపురుషుడు అని, నెహ్రూ పిల్లల పట్ల గాఢమైన వాత్సల్యాన్ని మరియు మక్కువ ఎక్కువ కలిగి ఉండడం మరియు వారితో తన సమయాన్ని గడపడంతో ఆనందించేవారు. పిల్లలను మరియు వారి అమాయకత్వాన్ని గౌరవించడానికి మరియు పిల్లలతో నెహ్రూ గారికి ఉన్న మక్కువ వల్ల నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నమని , ఈ రోజున పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర సంస్థలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు ఇట్టి కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల్స్ గంగాధర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయ మ్యాకల నర్సయ్య చిట్యాల లక్ష్మీనారాయణ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయూబ్ రాజు కండ్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు


# పుష్ప.2 భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ

కబురు సినిమా నవంబర్ 14..
టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ప్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. ఈ నేపథ్యంలో భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ చేశారు. ఈ నెల 17న పాట్నాలోని గాంధీ మైదాన్ సాయంత్రం 5 గంటల నుంచి పుష్ప ది రూల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. మొత్తానికి పుష్పరాజ్ మేనియా ఈ సారి గట్టిగానే ఉండబోతుందని తాజా పోస్టర్ చెప్పకనే చెబుతోంది.



ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# కడపకు వెళ్లనున్న రాంచరణ్ .. కారణమిదే..!



కబురు సినిమా నవంబర్ 14..
టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం గేమ్ ఛేంజర్ సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లోస్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే ప్రమోషనల్ ప్లాన్‌తో ఫుల్ బిజీగా ఉంది గేమ్ ఛేంజర్ టీం. కాగా రాంచరణ్ ప్రఖ్యాతి గాంచిన ఏపీలోని కడప దర్గాను సందర్శించనున్నాడు. తాజా సమాచారం ప్రకారం నవంబర్ 18న జరుగనున్న 80వ దర్గా నేషనల్ ముషైరా ఘజల్ ఈవెంట్‌కు రాంచరణ్ ముఖ్యఅతిథిగా హాజరుకాబోతున్నాడు. ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలపై త్వరలోనే క్లారిటీ రానుందని టాక్. మరోవైపు రాంచరణ్ ఉప్పెన డైరెక్టర్ బుచ్చిబాబు సానతో చేయబోయే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాయిన్ కావాల్సి ఉంది. ఆర్‌సీ 16 మైసూర్ షెడ్యూల్‌కు సంబంధించిన కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది. గేమ్ ఛేంజర్‌లో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాజోలు సుందరి అంజలి, నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# బ్రేకప్ వల్ల డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా : రాశీఖన్నా

కబురు సినిమా నవంబర్ 14..
కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ వెలుగువెలిగింది పంజాబీ భామ రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత టాలీవుడ్‌లో కాస్త బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం 'తెలుసు కదా' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో ఆమె నటించిన 'ది సబర్మతీ రిపోర్ట్' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. గుజరాత్ గోద్రా రైలు దహనం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రాశీఖన్నా. గతంలో తాను ప్రేమలో ఉన్నానని, అనుకోని కారణాల వల్ల బ్రేకప్ అయిందని తన విఫల ప్రేమను తలచుకొని భావోద్వేగానికి గురైంది. రాశీఖన్నా మాట్లాడుతూ 'నేను చాలా సున్నిత మనస్కురాలిని. కొన్నేళ్ల క్రిందట ఓ వ్యక్తిని గాఢంగా ప్రేమించాను. కానీ దురదృష్టవశాత్తు మేమిద్దరం విడిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. కొన్ని నెలల పాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. ఆ తర్వాత ధైర్యాన్ని కూడగట్టుకొని కెరీర్ మీద దృష్టి పెట్టాను. నా శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల మద్దతు వల్ల ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడ్డా' అని చెప్పింది. అ యితే తనతో ప్రేమాయణం నడిపిన వ్యక్తి గురించి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు రాశీఖన్నా. దాంతో సదరు వ్యక్తి ఎవరోనని అభిమానులు ఆరా తీస్తున్నారు. రంజన్ చందేల్ దర్శకత్వం వహించిన 'ది సబర్మతీ రిపోర్ట్' ఈ నెల 15న విడుదల కానుంది.

# అమిర్‌ఖాన్‌ను కలవనున్న దిల్‌రాజ్

## - భారీ ప్రాజెక్టుకు ప్లాన్



కబురు సినిమా నవంబర్ 14..
టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు హిందీలో పలు సినిమాలు తెరకెక్కించాడని తెలిసిందే. అంతేకాదు ఇటీవలే బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్‌ను కలిసి ఓ ప్రాజెక్ట్ చేసే విషయమై చర్చించినట్టు వార్తలు తెరపైకి వచ్చాయి. టాలీవుడ్ లీడింగ్ డైరెక్టర్ వంశీపైడిపల్లి ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. కాగా వంశీపైడిపల్లి ఇటీవలే అమీర్ ఖాన్‌కు సినిమా లైన్‌ను వినిపించగా.. ఎక్జయిట్ అయిన అమీర్ ఖాన్ పూర్తి స్క్రిప్ట్‌తో రావాలని సూచించాడట. తాజాగా దీనికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. వంశీపైడిపల్లి స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశాడని.. త్వరలోనే దిల్ రాజుతో కలిసి ముంబైలో అమీర్‌ఖాన్‌ను కలువబోతున్నాడని బీటౌన్ సర్కిల్‌తోపాటు టాలీవుడ్‌లో వార్త ఒకటి హల్ చల్ చేస్తోంది. ఒకవేళ ఈ ప్రాజెక్టు ఒకే అయితే మాత్రం దిల్ రాజు హోం బ్యానర్‌లో వంశీపైడిపల్లి- అమీర్ ఖాన్ కాంబోలో రాబోయే భారీ డీల్ అని చెప్పక తప్పదు. మరి ఈ క్రేజీ ప్రాజెక్టుపై రాబోయే రోజుల్లో అధికారిక ప్రకటన ఏదైనా వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు. ఇంతకీ దిల్ రాజు ఎలాంటి సినిమా ప్లాన్ చేశాడోనని ఇండస్ట్రీ సర్కిల్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది.




# రౌడీ బాయ్.. శ్రీలీలతో భారీ కాంబినేషన్

## వీడి.12తో ప్రేక్షకుల ముందుకు..?

కబురు సినిమా నవంబర్ 14..
రౌడీ బాయ్ 'విజయ్ దేవరకొండ' హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న సినిమా 'వీడి12'. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. 2025 సమ్మర్‌లో రిలీజ్ కానున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే రిలీజైన ఓ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ లుక్ అందరిని తెగ ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే మూవీ టీమ్ అప్డేట్స్‌తో హైప్ క్రియేట్ చేయాలనీ భావిస్తోంది. అయితే ఈ చిత్ర మేకర్స్ చేసిన ప్లాన్‌కి మీ మైండ్ బ్లైండ్ కావాల్సిందే. ఇంతకీ ఈ మూవీ మేకర్స్ ఎం ప్లాన్ చేశారంటే.. ఈ సినిమా టైటిల్ కూడా ఇంకా రివీల్ కాకపోవడంతో మేకర్స్ టైటిల్ టీజర్‌ని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ టీజర్‌కి గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృషని వాయిస్ ఓవర్ ఇచ్చేందుకు సంప్రదించారట మేకర్స్. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించారట. దీంతో రౌడీ బాయ్ ప్లస్ గాడ్ ఆఫ్ మాసెస్ కాంబినేషన్‌లో టీజర్ ఊహించుకుంటేనే గూస్ బంప్స్ వస్తున్నాయి అంటున్నారు ఫ్యాన్స్. 'మళ్ళీ రావా', 'జెర్సీ' వంటి సినిమాలతో ఫీల్ గుడ్ ఎమోషనల్ సినిమాలు అందించిన గౌతమ్ తిన్ననూరి ఈ సారి యాక్షన్ జోనర్ లోకి షిఫ్ట్ అయ్యాడు. ఈ సినిమా పోస్టర్ చూస్తేనే తెలిసిపోతుంది. ఇక విజయ్ దేవరకొండ కూడా ఈ సినిమాపై ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడు. ఇది మంచి కంబ్యాక్ ఫిల్మ్ కాబోతుందని విశ్లేషకుల మాట. ఈ గ్యాప్‌లో గౌతమ్ మరో చిన్న ప్రాజెక్ట్ తో థియేటర్ల ముందుకి రానున్నాడు. నూతన నటీనటులతో 'మ్యూజిక్' అనే సరికొత్త చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ చివర్లో తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ.. వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందించనుండటం విశేషం.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com